సాక్షి జనగామ

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఆరోగ్యశ్రీ సేవలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సగం ఆస్పత్రుల్లో నిలిచిపోయాయి. - 8లో▸



పంచ పరివర్తనతోనే సమాజ పరివర్తన

పంచ పరివర్తనతోనే సమాజ పరివర్తన సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రామచంద్రం అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$33^0/24^0$

జిల్లాలో ఉదయం అక్కడక్కడా ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది. వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం, సాయంత్రం చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు ఎస్‌జీఎఫ్ఐ ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ పోటీల ఎంపిక

జనగామ: జిల్లా కేంద్రంలో హన్మకొండ రోడ్డులోని సాంఘిక గురుకులంలో ఈ నెల 20వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలో 19 సంవత్సరాల కళాశాల బాలుర ఫుట్‌బాల్ క్రీడాపోటీల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని క్రీడల కన్వీనర్, పీడీ అజ్మీరా కిషన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ కళాశాల నుంచి ఐదుగురు క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెలచివరి వారంలో రాష్ట్ర స్థాయిలో జరిగే ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. 20వ తేదీన ఉదయం 10 గంటలలోపు ఒరిజినల్ 10వ తరగతి మెమో, సాంఘిక గురుకులంలో ఉండాలని, ఒరిజినల్ ఆధార్ కార్డుతో అందుబాటులో ఉండి, పేర్లను నమోదుచేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 83749 10159, 98490 59284 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సీపీఐ ఆల్‌ఇండియా మహాసభ ప్రతినిధుల ఎంపిక



రాజారెడ్డి



ఆకుల శ్రీనివాస్

జనగామ రూరల్: పంజాబ్ రాష్ట్ర రాజధాని చండీగర్‌లో ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు సీపీఐ అఖిలభారత 24వ మహాసభ ప్రతినిధులుగా జిల్లా నుంచి పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి, సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకత్వానికి వారు కృతజ్ఞత తెలిపారు. దేశంలో జరుగుతున్న రాజకీయ అస్థిర పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీల అవసరం, ప్రాధాన్యం గురించి ప్రజల్లో ఏదైతే చర్చించుకుంటున్నారో దానికి అనుకూలంగా మహాసభలో చర్చిస్తామని రాజారెడ్డి చెప్పారు.

సబ్‌కోర్టు ఏపీపీగా బండ శ్రీనివాస్



జనగామ: జనగామ సబ్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా(ఏపీపీ) పట్టణానికి చెందిన బండ శ్రీనివాస్ నియమితులయ్యారు. హైదరాబాద్ ఆర్ఆర్ఆర్ కళాశాలలో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన, 2011 నుంచి న్యాయవాది వృత్తిలో ప్రాక్టీసు చేస్తున్నారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, యశస్వినీరెడ్డి, సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ కవులపై వ్యాసరచన పోటీలు

జనగామ రూరల్: రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిరికొండ కుమారస్వామి, శ్రీనివాసాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని కవులు బమ్మెర పోతన, దాశరథి కృష్ణమాచార్య, కాళోజీ నారాయణరావు, సుద్దాల హనుమంతు, వట్టికోట ఆళ్వార్‌స్వామి, వానమామలై వరదాచార్యులు, సురవరం ప్రతాపరెడ్డి, పాకాల యశోదారెడ్డి, బోయ జంగయ్య, సి.నారాయణరెడ్డి వంటి కవులపై జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తామన్నారు. అక్టోబర్ 6వ తేదీ లోపల రిజిస్ట్రేషన్ చేసుకొని వ్యాసాలను జిల్లా స్థాయికి పంపించాలని తెలియజేశారు. ఆసక్తి గల వారు 99897 24110 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యూరియా పంపిణీ పరిశీలన



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో గురువారం యూరియా బస్తాల పంపిణీని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న హాకా సెంటర్‌ను, హాకా గోదాంను ఆయన సందర్శించారు. సెంటర్‌లో ఉన్న యూరియా బస్తాలను పరిశీలించారు. అనంతరం హాకా సెంటర్ నిర్వాహకులతో, వ్యవసాయ అధికారులతో మాట్లాడుతూ రైతులకు సక్రమంగా యూరియా పంపిణీ చేయాలని సూచించారు. ఆయన వెంట ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ జి.వేణు తదితరులు ఉన్నారు.

సద్దుల కానుక



జిల్లాకు చేరుకున్న బతుకమ్మ చీరలు

బతుకమ్మ పండుగకు ఆడపడుచులకు ప్రభుత్వం చీరల పంపిణీ

- మహిళా సంఘాల సభ్యులకు అందజేత
- జిల్లాకు 1.44 లక్షలు కేటాయింపు.. ఇప్పటికే చేరిన 50వేల చీరలు
- మార్గదర్శకాలు వచ్చిన వెంటనే పంపిణీ ప్రారంభం

జనగామ: రాష్ట్రంలో సద్దుల బతుకమ్మ పండుగ ప్రత్యేకతే వేరు. తొమ్మిది రోజుల పాటు పూల పండగను ఆడపడుచులు అత్యంత వైభవోపేతంగా జరుపుకుంటారు. సంప్రదాయం, సంస్కృతి, సంతోషం కలిసే బతుకమ్మలో ఈసారి కూడా ప్రభుత్వ కానుకతో పండుగ వాతావరణం మరింత ఉత్సాహంగా మారనుంది. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా బతుకమ్మ పండగను పురస్కరించుకుని మహిళలకు చీరలను కానుకగా అందించే పథకాన్ని అమలుచేసింది. ప్రస్తుత సర్కారు సైతం అదే ఆనవాయితీ కొనసాగిస్తోంది. జిల్లావ్యాప్తంగా మహిళా సంఘాల్లోని సభ్యులకు చీరల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది.

జిల్లాకు 1.44లక్షల చీరలు

బతుకమ్మ పండగ నేపథ్యంలో ప్రభుత్వం జనగామకు 1.44 చీరలను కేటాయించగా, ఇప్పటివరకు సుమారు 50 వేలు జిల్లాకు చేరుకున్నాయి. జిల్లాలో 1.30లక్షల మంది మహిళా సభ్యులు ఉండగా, 10 శాతం అదనంగా చీరల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపించారు. మిగతా చీరలు కూడా త్వరలోనే రానున్నాయి. ముఖ్యంగా మహిళా సంఘాల్లో సభ్యురాలైన ఆడపడుచులకు ఒకటి చొప్పున చీరలను అందించనున్నారు. చీరల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. సర్కారు నుంచి అధికారికంగా మార్గదర్శకాలు వచ్చిన వెంటనే మండలాలు, గ్రామాల వారీగా పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న చీరల కానుక ఈ పండుగలో ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. ప్రతీ ఇంటికి చేరే ఈ చీరలు బతుకమ్మ పండుగను మరింత రంగులమయం చేయనున్నాయి.



చీరను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల(ఫైల్)

మండలాల వారీగా మహిళా సంఘాల వివరాలు

మండలం	వీవో	ఎస్‌హెచ్‌జీ	సభ్యులు
బచ్చన్నపేట	48	1,048	12,250
చిల్పూరు	30	907	10,069
దేవరుప్పుల	42	1,032	11,986
స్టే.ఘన్‌పూర్	42	1,130	13,153
జనగామ	34	991	11,587
కొడకండ్ల	35	695	8,679
లిం. ఘణపురం	43	984	11,016
నర్మెట	26	527	6,654
పాలకుర్తి	61	1,308	14,648
రఘునాథపల్లి	53	1,278	14,708
తరిగొప్పుల	20	482	5,578
జఫర్‌గడ్	32	860	9,983
మొత్తం	466	11,282	1,30,311

మండలాల వారీగా కేటాయింపులు

జిల్లాకు 50వేల బతుకమ్మ చీరలు చేరుకోగా.. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో 11,282 ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఉండగా, 1,30,311మంది మహిళా సభ్యులు ఉన్నారు. సిరిసిల్ల కార్మికులు ఈ చీరలను తయారుచేయగా, ప్రభుత్వం వాటిపై రంగు రంగుల ప్రింటింగ్‌ను మాత్రం మరోచోట వేయించింది. ఇటీవల సిరిసిల్లలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చీరలను ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. అనేక రంగులు, జరి, డిజైన్లతో చీరలు మహిళలను ఆకట్టుకోనున్నాయి.

చీరలు వచ్చాయి..

జిల్లాకు 1.44 లక్షల చీరలను కేటాయించగా, ఇప్పటివరకు 50వేలు వచ్చాయి. మిగతా చీరలు ఒకటి, రెండు రోజుల్లో వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం వచ్చిన చీరలను కలెక్టరేట్ ఆవరణలోని గోదాంలో భద్రపరిచాం. మహిళా సంఘాల్లో సభ్యురాలైన వారికి ఒకటి చొప్పున చీరను పంపిణీ చేస్తాం. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే, పంపిణీ తేదీలతో సమగ్ర సమాచారం విడుదల చేస్తాం.



- వసంత, డీఆర్డీవో పీడీ

అన్నింటికన్నా ఆరోగ్యమే మిన్న



బచ్చన్నపేటలో అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్‌కుమార్

- ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్‌కుమార్

బచ్చన్నపేట: అన్నింటికన్నా ఆరోగ్యమే మిన్నా అని అందుకుగానూ గ్రామాల్లోని వీధులను, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్‌కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని సెకండరీ పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో 600 మంది విద్యార్థులతో కలిసి శ్రమదానం చేసి మొక్కలను నాటారు. విద్యార్థులతో కలిసి స్వచ్ఛతాహీ సేవా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛత పక్షోత్సవాలను చేపడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతీరోజు పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలను నిర్వహిస్తూ, గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూపారాణి, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రామానుజాచారి, ఎంపీడీఓ మమతాబాయ్, ఎంపీఓ వెంకటమల్లికార్జున్ ,డీసీ ఎస్‌బీఎం కర్ణాకర్, పంచాయతీ కార్యదర్శి అనిల్ రాజ్, చక్రధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగొద్దు

రైతులకు సరిపడా యూరియా నిల్వలను ఉంచాలని వారికి ఇబ్బంది కలుగకుండా చూడాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాములలో గల యూరియా బస్తాల నిల్వలను పరిశీలించారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఇందిరమ్మ ఇళ్ల గురించి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ప్రయోగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

లింగాలఘణపురం: విద్యార్థులు ప్రయోగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మోడల్ స్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. అందులోని పరికరాలు, వాటిని వినియోగిస్తున్న తీరును తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ సునిత, ఎంఈఓ విష్ణుమూర్తి, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు వేగంగా పూర్తిచేయాలి

జనగామ రూరల్: ఇందిరమ్మ ఇళ్లు వేగవంతంగా పూర్తిచేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై గూగుల్ మీట్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో 28,975 ఇందిరమ్మ ఇళ్లు చేపట్టడం జరిగిందన్నారు. ఈనెల 30లోపు నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి వంద శాతం ప్రగతి సాధించాలన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ మాత్యనాయక్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, సెక్రటరీలు పాల్గొన్నారు.

పదిలో ప్రథమ స్థానంలో నిలవాలి

పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలవాలని, విద్యార్థుల హాజరు 100శాతం నమోదు చేయాలని అలాగే పుస్తకాలు, యూనిఫాం పంపిణీ పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పాఠశాలల ప్రగతిపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. దిక్సూచి ప్రోగ్రాంలోని ప్రతీ అంశంపై విద్యార్థులకు అవగాహన కలిగే విధంగా కృషి చేయాలన్నారు. అక్టోబర్ నుంచి మధ్యాహ్న భోజన పథకం ఆన్‌లైన్ కానున్నదని అందుకు సిద్ధంగా ఉండాలన్నారు. 19, 20 తేదీల్లో ప్రతి ఎంఈఓ, ప్రధాన ఉపాధ్యాయులు కనీసం మూడు స్కూళ్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. విద్యాశాఖ ఏడీ మూర్తి, ఏఎంఓ శ్రీనివాస్, జిల్లా బాలికల పరిరక్షణ అధికారి గౌసియా బేగమ్, నాగరాజు,శ్రీకాంత్ పాల్గొన్నారు.

‘వేటా’ బతుకమ్మ వేడుకలకు ఆహ్వానం

దేవరుప్పుల: అమెరికా కాలిఫోర్నియాలో వెటా ఆధ్వర్యంలో తలపెట్టిన బతుకమ్మ వేడుకలకు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్కకు టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, వేటా వ్యవస్థాపక అధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి గురువారం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా అమెరికాలో కాలిఫోర్నియా విమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ (వేటా) వ్యవస్థాపక అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్న ఝాన్సీరెడ్డితోపాటు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగను విదేశాల్లోనూ వేటా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని, బతుకమ్మ వైభవాన్ని చాటుతామని తెలిపారు. వారితో పాటు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ఉన్నారు.



మంత్రి సీతక్కకు ఆహ్వానం పలుకుతున్న యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి, చిత్రంలో గండ్ర

జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు

- రైతులు ఆందోళన చెందవద్దు
- డీఏఓ అంబికా సోని



మాట్లాడుతున్న డీఏఓ అంబికా సోని

జనగామ: జిల్లాలో వానాకాలం సీజన్‌లో పంటలకు సరిపడా యూరియా ఉందని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోని అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని 403.26 టన్నుల యూరియా సహకార సంఘాలు, ప్రైవేట్ కేంద్రాల వద్ద ఉందన్నారు. బచ్చన్నపేటలో 41.40 మెట్రిక్ టన్నులు, చిల్పూర్‌లో 48.98, దేవరుప్పులలో 20.00, స్టేషన్ ఘనపూర్‌లో 25.00, జనగామలో 44.00, కొడకండ్లలో 15.00, లింగాల ఘణపురంలో 37.00, నర్మెటలో 27.88, పాలకుర్తిలో 25.00, రఘునాథపల్లిలో 56.00, తరిగొప్పులలో 28.00, జఫర్‌గడ్‌లో 35 టన్నుల నిల్వలు ఉన్నట్లు, సీజన్‌లో ఎలాంటి కొరత లేకుండా చూస్తున్నామన్నారు. యూరియా వినియోగం ఎక్కువగా వరి పంటలోనే ఉంటుందన్నారు. జిల్లాలోని గ్రామాల వారీగా కేటాయించిన కేంద్రాల ద్వారా యూరియా సరఫరా చేస్తున్నామని, పంట దశను బట్టి రెండో లేదా మూడో మోతాదులో చల్లుకుని పంట ఉత్పత్తి పెరిగేలా చూసుకోవాలని డీఏఓ తెలిపారు.

నిద్రాహారాలు అక్కడే..

- యూరియా కోసం అర్ధరాత్రి నుంచి క్యూలో రైతులు
- సొసైటీ గోదాం వద్దే నిద్ర, భోజనం

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం సొసైటీ గోదాం వద్ద అర్ధరాత్రి నుంచి రైతులు క్యూలో ఉంటున్నారు. టోకెన్ల కోసం క్యూలైన్‌లో చెప్పులు, రాళ్లు పెట్టి అక్కడే నిద్రపోతున్నారు. తెల్లవారుజామున అక్కడికే భోజనం తెప్పించుకుని తింటున్నారు. గురువారం 244 బస్తాల యూరియా రాగా 800 మంది రైతులు బారులు తీరురారు. చివరికీ ఒక్క రైతుకు ఒక్క బస్తా చొప్పున 244 మందికి యూరియా అందజేశారు. మిగిలిన రైతులకు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తీసుకొని పేర్లు నమోదు చేసుకున్నారు. వారికి మరో దఫా అందించనున్నారు.



సొసైటీ గోదాం వద్ద భోజనం చేస్తున్న రైతులు



గోదాం వద్ద నిద్రిస్తున్న రైతులు



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

క్రిస్టియన్ల అభివృద్ధికి చర్యలు

- రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్ కొక్కడన్

జనగామ రూరల్: క్రిస్టియన్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొంటోందని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ కొక్కడన్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో క్రిస్టియన్ ప్రజల సమస్యలపై జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్‌లతో కలిసి పాస్టర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దీపక్ జాన్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేద క్రిస్టియన్ సోదరులకు అందే విధంగా ప్రతీ ఆదివారం చర్చిలలో తెలియజేయాలని సూచించారు. పాస్టర్లు కోరిన విధంగా ప్రధాన సమస్యలపై దృష్టిపెట్టి ముందుగా ప్రతీ నియోజకవర్గంలో శ్మశాన వాటిక, కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. చర్చి నిర్మాణాలకు అనుమతులు, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరుకు ప్రభుత్వ నిబంధనల మేరకు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో జనాభా లెక్కల ప్రకారం సుమారు 6వేలు క్రిస్టియన్లు ఉన్నారన్నారు. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి నియోజక వర్గాలలో బరియల్ గ్రౌండ్‌కు చర్యలు తీసుకుంటామని, మున్సిపాలిటీలలో కమ్యూనిటీ హాల్స్ కేటాయించామని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమాధికారి బి.విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ కొక్కడన్

సర్కారు బడుల్లో రాగి జావ పంపిణీ



రాగిజావ, బెల్లంపొడి ప్యాకెట్



నర్మెట మండలం మాన్‌సింగ్ తండా పీఎస్‌లో రాగిజావ తీసుకుంటున్న విద్యార్థులు

జనగామ: ప్రభుత్వ బడులకు వచ్చే విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంచుకుని గురువారం నుంచి రాగిజావ పంపిణీకి శ్రీకారం చుట్టింది. 438 ప్రాథమిక (జీరో స్కూల్స్ మినహాయించి), ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుకునే పిల్లలకు రాగిజావను అందించారు. నాణ్యమైన చదువుతో పాటు విద్యార్థుల శారీరక ధారుఢ్యం, మానసిక వికాసం పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

మూత ఎట్ల తీయల్నో!



మద్యం బాటిల్‌తో వానరం

కోతికి మందు బాటిల్ దొరికింది..అందులో ఏముందో..దాని మూత ఎట్ల తీయల్నో తెలియక కిందామీదా పడింది. గురువారం జనగామ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఓ వ్యక్తి బైక్‌లో మద్యం బాటిల్ ఉండగా..దాన్ని వానరం దొరకపట్టుకుంది. బాటిల్‌ను కౌగిలించుకుంటూ.. దాన్ని ఓపెన్ చేయడానికి విఫల యత్నం చేసింది. ఆ వైపుగా కోతిచేష్టలను చూస్తున్న బైక్ యజమాని మాత్రం బాటిల్ ఎక్కడ పగులుతుందోనని ఆందోళన చెందాడు. చివరకు వానరం మద్యం బాటిల్‌ను అక్కడే వదిలేసి చెట్టెక్కి కూర్చుంది. దీంతో బైక్ యజమాని బాటిల్ సేఫ్.. అనుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

-జనగామ

21న అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావ సభ

జనగామ రూరల్: హనుమకొండలో ఈ నెల 21వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం 49వ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు మదుపాక ఎల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షుడు కన్నారపు శివశంకర్ ఆధ్వర్యంలో ప్రచార కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. 1977 సెప్టెంబర్ 21న సంఘం ఆవిర్భావించిందని, అంబేడ్కర్ ఆలోచనా విధానంపై అనేక అవగాహన సదస్సులు నిర్వహించి కార్యకర్తలను చైతన్యపర్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రవి, సుద్దాల కుమారస్వామి, ఎండబట్ల భాస్కర్, సాంబరాజు యాదగిరి, రాగల్ల శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో గబ్బెట విద్యార్థులు

రఘునాథపల్లి: మండలంలోని గబ్బెట ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు. విజ్ఞాన సముపార్జనలో భాగంగా చారిత్రాత్మకమైన రాష్ట్రపతి నిలయాన్ని తిలకించడంలో విద్యార్థులు ఆసక్తిని కనబరిచారు. ఈ సందర్భంగా హెచ్ఎం సునంద మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న అభివృద్ధి సముపార్జనతో పాటు విద్యార్థులకు చారిత్రాత్మక, భౌగోళికమైన అంశాలపై అవగాహన ఎంతో అవసరమని, అందుకే రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, ఉమాదేవి, జయ, సీఆర్‌పీ జ్యోతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రేణుక, వీఓఏ రుక్సానా, ఎల్లమ్మ తదితరులు ఉన్నారు.



రాష్ట్రపతి నిలయంలో గబ్బెట విద్యార్థులు, ఉపాధ్యాయులు

క్లుప్తంగా

యూరియా వచ్చేసింది..



యూరియాను పరిశీలిస్తున్న ఏఓ రవీందర్‌రెడ్డి

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే స్టేషన్ గూడ్స్ షెడ్‌కు గురువారం 1,386.900 మెట్రిక్ టన్నుల స్పిక్ కంపెనీ యూరియా, 507 మెట్రిక్ టన్నుల 20.20.013 రకం ఎరువులు చేరాయి. యూరియా వ్యాగన్‌ను కంపెనీ అధికారులు రమణరెడ్డి, తిరుమల్‌రావులతో కలిసి వ్యవసాయ అధికారులు విజ్ఞాన్, రవీందర్‌రెడ్డి పరిశీలించారు. 1,386.900 మెట్రిక్ టన్నుల స్పిక్ యూరియాను వరంగల్ జిల్లాకు 256, హనుమకొండ 250, ములుగు 240, భూపాలపల్లి 300, జనగామ జిల్లాకు 340 మెట్రిక్ టన్నులు కేటాయించారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు డబుల్ ధమాకా

- సాంకేతిక లోపంతో రెండుసార్లు రూ.లక్ష చొప్పున జమ

జనగామ: ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు సాంకేతిక లోపం డబుల్ ధమాకాతో మురిపించింది. గృహ నిర్మాణ సంస్థ సాఫ్ట్‌వేర్‌లో ఏర్పడిన సమస్యతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,300 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రెండుసార్లు రూ.లక్ష చొప్పున బిల్లులు జమయ్యాయి. ఈనెల 12, 15(శుక్రవారం, సోమవారం)వ తేదీల్లో ఒక్కో లబ్ధిదారుడి ఖాతాల్లో రెండుసార్లు రూ.లక్ష చొప్పున డిపాజిట్ అయినట్లు సమాచారం. లబ్ధిదారుల ఖాతాల్లో రెండుసార్లు డబ్బులు జమ కావడాన్ని ఆలస్యంగా గుర్తించిన ఉన్నతాధికారులు తిరిగి ప్రభుత్వ ఖాతాల్లో జమ చేయాలని గృహ నిర్మాణ శాఖకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. జనగామ జిల్లాలో సుమారు 20 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.లక్ష చొప్పున రెండుసార్లు డబ్బులు జమైనట్లు అధికారులు నిర్ధారించారు. ఈ విషయమై జనగామ హౌసింగ్ పీడీ మాతృనాయక్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 15 మంది ఉండొచ్చని, ఎవరు కూడా డబ్బులు డ్రా చేసుకోలేదని, రేపటికల్లా తిరిగి తీసుకుంటామని చెప్పారు. ఉమ్మడి వరంగల్ పరిధి మిగతా జిల్లాలోనూ 20–30 మందికి రెండుసార్లు డబ్బులు జమ అయినట్లు తెలిసింది.

విద్యార్థులు పఠనాసక్తి పెంపొందించుకోవాలి

హనుమకొండ డీఈఓ వాసంతి



మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి: విద్యార్థులు పఠనాసక్తి పెంపొందించుకోవాలని హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి డి.వాసంతి కోరారు. ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు విశ్రాంత ఉపాధ్యాయుడు తాడూరి రమేశ్ ఇచ్చిన రూ.50 వేల విరాళంతో గ్రంథాలయం, గ్రానైట్ యజమాని సత్యనారాయణ ఇచ్చిన రూ.50 వేలతో ల్యాబ్‌ను పీజీ హెచ్‌ఎం బద్దం సుదర్శన్‌రెడ్డి ఏర్పాటు చేయించారు. ఈ మేరకు గురువారం ల్యాబ్, గ్రంథాలయాన్ని ఆమె దాతలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పుస్తక పఠనంతోనే విద్యార్థుల్లో జ్ఞానం పెరుగుతుందన్నారు. మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దుర్గాభవాని, జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ సుదర్శన్‌రెడ్డి, పాఠశాల చైర్‌పర్సన్ నీరజ, గ్రామ మాజీ సర్పంచ్ రత్నాకర్, ప్రతాప్, రామారావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటస్వామి, వెంకటసుహాసిని, పద్మలత, కల్యాణి, రమాదేవి, ప్రసాద్‌రావు, అఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 72 నెట్‌వర్క్ హాస్పిటల్స్

- వాటిలో 34 ఆస్పత్రుల్లో నిలిచిన సేవలు
- ప్రభుత్వం బకాయిలు చెల్లించాలంటున్న యాజమాన్యాలు
- ప్రతీ రోజు సుమారు 2,500 మంది రోగులకు ట్రస్ట్ వైద్యం



వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో ఖాళీ ఉన్న ఆరోగ్యశ్రీ కౌంటర్

గీసుకొండ: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఆరోగ్యశ్రీ సేవలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సగం ఆస్పత్రుల్లో నిలిచిపోయాయి. ప్రభుత్వం బకాయిలు చెల్లించక పోవడంతో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల వారు సేవలు నిలిపివేశారు. ప్రభుత్వం తరఫున వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర నర్సింహ, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ ఉదయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. తక్షణమే బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో సేవలు నిలిపివేస్తున్నట్లు నెట్ వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ వారు ప్రకటించిన విషయం తెలిసిందే. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 72 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉండగా వాటిలో 34 ఆస్పత్రుల్లో సేవలను నిలిపివేసినట్లు వాటి యాజమాన్యాలు చెబుతున్నాయి. మిగతా ఆస్పత్రుల్లో సేవలు కొనసాగుతున్నాయని, సేవలను నిలిపివేసిన యాజమాన్యాలకు నచ్చజెబుతున్నామని ఆరోగ్యశ్రీ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నిఖిల్ స్వరూప్ తెలిపారు. అయితే, ఉమ్మడి జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం ఎంత బకాయి ఉందనేది ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పోర్టల్‌లో కనిపించడం లేదు. నెట్‌వర్క్ ఆస్పత్రులు, ట్రస్ట్ మధ్యనే ఈ లెక్కల వివరాలు ఉన్నట్లు సమాచారం. జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రతీ రోజు సుమారు 2,500 వరకు రోగులు పరీక్షలు చేయించుకోవడానికి వస్తుంటారని, వారిలో సుమారు 180 మంది వరకు చికిత్స, ఆపరేషన్లు చేయించుకోవడానికి జాయిన్ అవుతారని తెలుస్తోంది. గత ఏడాది మార్చి నెల నుంచి తమకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం చెల్లించడం లేదని ఆస్పత్రుల వారు అంటున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులు

జిల్లా పేరు	నెట్‌వర్క్ ఆస్పత్రులు	సేవలు నిలిపివేసినవి
హనుమకొండ	45	21
వరంగల్	14	10
జనగామ	4	0
మహబూబాబాద్	7	2
భూపాలపల్లి	2	1
ములుగు	0	0
మొత్తం	72	34



ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఆస్పత్రి ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తాము భరించలేని విధంగా ఖర్చులు పెరుగుతుండటంతో తప్పని పరిస్థితిలో సేవలను నిలిపివేయాల్సి వచ్చిందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా కొన్ని ఆస్పత్రుల వారు సేవలను నిలిపివేయడంతో ఫాదర్ కొలంబో, ప్రతిమ, ఎంజీఎం, కేఎంసీలోని ఆస్పత్రుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాగే, సేవలు కొన్ని రోజులపాటు కొనసాగితే రోగులకు ఇబ్బంది తప్పేలా లేదు. ఈ విషయమై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకుంటే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అంత్యక్రియలకు వెళ్లొస్తూ అనంతలోకాలకు..

- బైక్‌ను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్
- తల్లి దుర్మరణం.. కుమారుడికి తీవ్రగాయాలు
- డీసీ తండా వద్ద ఘటన



రేశమ్మ(56)

వర్ధన్నపేట: తమ బంధువు అంత్యక్రియలకు వెళ్లొస్తూ ఓ వృద్ధురాలు అనంతలోకాలకు చేరింది. బైక్‌ను ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో తల్లి దుర్మరణం చెందగా, కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ విషాదకర ఘటన మున్సిపాలిటీ పరిధి వరంగల్–ఖమ్మం రహదారి డీసీ తండా వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కమ్మనపల్లి తండా గ్రామానికి చెందిన గుగులోత్ రేశమ్మ(56) తన కుమారుడు తుకారంతో కలిసి గురువారం ఉదయం బైక్‌పై రాయపర్తి మండలం టీకే తండాలో జరిగిన తమ బంధువు అంత్యక్రియలకు హాజరయ్యారు. కార్యక్రమం పూర్తయిన అనంతరం అదే రోజు రాత్రి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వరంగల్– ఖమ్మం రహదారి డీసీ తండా వద్ద ఆయిల్ ట్యాంకర్ ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రేశమ్మ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. కుమారుడు తుకారామ్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఎంజీఎం తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గేదెల కాపరి ..

మహబూబాబాద్ రూరల్ : ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ గేదెల కాపరి దుర్మరణం చెందగా మూడు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంకర మిల్ తండా వద్ద చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సుందరయ్య నగర్ కాలనీకి చెందిన రేఖ సోమయ్య మేనల్లుడు గంగుల వెంకన్న (42) గేదెలను మేత నిమిత్తం గురువారం ఉదయం మున్నేరువాగు సమీపంలోకి తీసుకెళ్లాడు. రాత్రి సమయంలో తీసుకుని వస్తుండగా నర్సంపేట డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు కంకరమిల్ తండా వద్ద గేదెలను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ మూడు గేదెలు వచ్చి వెంకన్నపై పడగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని 108లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన గేదెలకు వైద్య చికిత్స చేయిస్తున్నారు. అనంతరం మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వెంకన్న(ఫైల్)

బొలెరో ఢీకొని అయ్యగారిపల్లిలో రైతు..



మధుసూదన్(ఫైల్)

కురవి: చేను వద్ద నుంచి నడుచుకుంటూ ఇంటికొస్తున్న ఓ రైతును బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ రైతు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని అయ్యగారిపల్లిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు పొన్నెబోయిన మధుసూదన్(48) చేను వద్ద పని ముగించుకుని పశువులను ఇంటికి తోలుకొస్తున్నాడు. ఈ క్రమంలో బొలెరో వాహనం మరిపెడ నుంచి కురవి వైపునకు వస్తూ మధుసూదన్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడడంతో స్థానికులు వెంటనే మానుకోట లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. మధుసూదన్ మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడి మృతి



చిరబోయిన రాజు

నర్సంపేట : విద్యుదాఘాతంతో ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేటలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చెన్నారావుపేటకు చెందిన చిరబోయిన రాజు(30) ఖాదర్‌పేటలోని పెండ్లి ఐలయ్య ఇంటి నిర్మాణంలో భాగంగా సెంట్రింగ్ పనులు చేయడానికి వెళ్లాడు. బుధవారం స్లాబ్ వేస్తుండగా సెంట్రింగ్ సరి చేస్తున్న క్రమంలో చేతిలో ఉన్న బైండింగ్ వైర్ ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ తీగకు తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించారు. పరిస్థితి విషయంగా ఉండడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, కుమారులు వరుణ్‌సాయి, చరణ్‌సాయి ఉన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి..



లక్కు(ఫైల్)

కేసముద్రం/ ఖిలా వరంగల్: ట్రాక్ దాటుతుండగా గూడ్స్ (రైలు) ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్ కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధి ఎన్టీఆర్ నగర్‌కు చెందిన భుక్యా లక్కు(53) ఇంటికన్నె–కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య ఫ్లై ఓవర్ సమీపంలో ట్రాక్ దాటుతుండగా డౌన్‌లైన్‌లో వచ్చిన గూడ్స్ ఢీకొంది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గంజాయి రవాణాదారులకు పదేళ్ల జైలు



వరంగల్ లీగల్ : నలుగురు గంజాయి రవాణాదారులకు 10 సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి కె.అపర్ణాదేవి గురువారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కథనం ప్రకారం.. హసన్‌పర్తి ఏఎస్సై ఉపేందర్‌రావు 2017, జనవరి 16న మల్లారెడ్డిపల్లి శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో ఇద్దరు ద్విచక్రవాహనంపై వస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించగా పట్టుకున్నారు. అనంతరం తనిఖీ చేయగా బస్తాలో ఎండు గంజాయి లభించింది. వెంటనే విచారించగా ద్విచక్రవాహనంపై వచ్చిన వారు శాయంపేట మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన నారిగే రాజయ్య, గంగిరేనిగూడెం సూర్యానాయక్ తండాకు చెందిన లావుడ్య భద్రమ్మగా తెలిసింది. గ్రామస్తుడు దుప్పటి మల్లయ్యతో కలిసి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో మల్లారెడ్డిపల్లికి చెందిన రైతులు బొల్ల అయిలయ్య , దాసరి కుమారస్వామి నుంచి కిలో గంజాయి రూ.వెయ్యికి కొనుగోలు చేసి హైదరాబాద్, కదిరి, మహారాష్ట్రకు కిలో రూ.6,500 చొప్పున అమ్మడానికి రవాణా చేస్తున్నామని ఒప్పుకున్నారు. అలాగే, వీరికి కొద్ది దూరంలో మరో రెండు బస్తాల గంజాయితో దుప్పటి మల్లయ్య, బొల్ల అయిలయ్య, దాసరి కుమారస్వామి ఉన్నారని తెలిసింది. పోలీసుల రాకను గమనించిన ముగ్గురు పరారయ్యారు. అనంతరం నిందితులను పట్టుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువుకావడంతో నలుగురు నేరస్తులు లావుడ్య భద్రమ్మ, దుప్పటి మల్లయ్య, బొల్ల అయిలయ్య, దాసరి కుమారస్వామికి 10 సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పు వెల్లడించారు. కాగా, విచారణ సమయంలోనే ప్రధాన ముద్దాయి నారిగే రాజయ్య మృతి చెందాడు. ఈ కేసును పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, కిషన్ పరిశోధించగా లైజన్ ఆఫీసర్ పరమేశ్వరి విచారణ పర్యవేక్షించారు. సాక్షులను హెడ్ కానిస్టేబుల్ వి.రవీందర్ కోర్టులో ప్రవేశపెట్టారు.

జైపూర్‌లో స్వచ్ఛతపై అధ్యయనం

వరంగల్ అర్బన్: స్టడీ టూర్‌లో భాగంగా గురువారం రాజస్థాన్‌లోని జైపూర్ నగరాన్ని నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది సందర్శించి స్వచ్ఛతపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా జైపూర్ మేయర్ సౌమ్య అక్కడ అవలంబిస్తున్న స్వచ్ఛ విధానాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛతలో 16 వ ర్యాంకు, స్వచ్ఛతాహీ సేవాలో మొదటి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఎస్‌ఎఫ్‌టీల ద్వారా సుమారు వెయ్యి టన్నుల సామర్థ్యంతో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ నిర్వహించి 12 మెగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. వంద శాతం ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించి, ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు, వరంగల్ మహానగర పాలకసంస్థకు సారూప్యత ఉందని తెలిపారు. రెండు నగరాలు హెరిటేజ్‌గా, యునెస్కో నుంచి గుర్తింపు పొందాయని వెల్లడించారు. అనంతరం జైపూర్ మేయర్, అధికారులు.. వరంగల్ మేయర్, కార్పొరేటర్లు, అధికారులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు ప్రదానం చేశారు.

యథావిధిగా గురుకుల టీచర్ల వేతనాలు

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హర్షం

న్యూశాయంపేట : మైనారిటీ గురుకులాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, పార్ట్‌టైం టీచర్ల వేతనాల్లో ఒకేసారి జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్, కుక్‌లు, కంప్యూటర్ టీచర్లు, పీడీ, పీఈటీ తదితర సిబ్బందికి ప్రభుత్వం సగటున రూ. 5 వేల నుంచి రూ.13 వేల మధ్య వారి వేతనాల్లో భారీ కోత విధించింది. దీంతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హైదరాబాద్‌లోని టెమ్రిస్ ప్రధాన కార్యాలయం ఎదుట, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో ఉద్యోగులు గురువారం నిరసన చేపట్టారు. దీంతో ప్రభుత్వం దిగి వచ్చి సవరించిన వేతనాల జీఓను రివైజ్ చేసింది. దీని ప్రకారం తిరిగి పాత వేతనాలు అందించేందుకు సవరించిన కొత్త జీఓను గురువారం ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా జారీచేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి రానున్నాయి. ఈ జీఓ వచ్చే విద్యాసంవత్సరం 2026 మార్చి వరకు అమల్లో ఉండనుంది.

బకాయిలు విడుదల..

రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో మైనారిటీ గురుకులాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన బాటపట్టారు. దీంతో ప్రభుత్వ ఎట్టకేలకు వారి రెండు నెలల వేతనాలను విడుదల చేసింది. అయితే కోత విధించిన వేతనాల ఎరియర్స్‌ను త్వరలో ఉద్యోగుల అకౌంట్లలో జమ చేయనున్నట్లు టెమ్రిస్ అధికారులు తెలిపారు. ఉద్యోగులు ఆందోళన చెందొద్దని తెలిపారు.

పంచ పరివర్తనతోనే సమాజ పరివర్తన

- కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: పంచ పరివర్తనతోనే సమాజ పరివర్తన సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రామచంద్రం అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం కేయూలో నిర్వహించిన విజయదశమి ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వదేశీ, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ వ్యవస్థ బలోపేతం, సామాజిక సామరస్యత, పౌర వ్యవస్థ బలోపేతం లాంటి అంశాలు సమాజ మార్పునకు పునాది రాళ్లు అవుతాయన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ దేశంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో కార్యకర్తలు ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారని ఆహారం, ఔషధాలు కూడా సరఫరా చేశారన్నారు. ఉత్సవ వక్త, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఖానాపురం ఉదయ్‌కుమార్‌మాట్లాడుతూ దేశంలో సమాజ పరివర్తన వ్యక్తి పరివర్తనతోనే సాధ్యమన్నారు. అందుకు పంచ పరివర్తన కీలకమన్నారు. రిటైర్డ్ ఆచార్యులు చిలుకమారి సంజీవ, జి. దామోదర్, పాలకమండలి సభ్యులు డాక్టర్‌చిర్రరాజు, ప్రొఫెసర్లు స్వర్ణలత, మామిడాల సుధాకర్, డాక్టర్ మంజుల, డాక్టర్ మమత తదితరులు పాల్గొన్నారు.

ముందే వచ్చిన శీతాకాల అతిథి!



బ్లూథ్రోట్ బర్డ్



ప్రకృతి ప్రేమికుడు జగన్

హన్మకొండ అర్బన్: సాధారణంగా శీతాకాలం(అక్టోబర్–మార్చి)లో దక్షిణ ఆసియా, భారతదేశం (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్), శ్రీలంక వరకు వలస వచ్చే బ్లూథ్రోట్ (నీలగొంతు పిట్ట) ఈ ఏడాది ముందే వచ్చింది. దీని శాస్త్రీయ నామం లూస్కినియా స్వేసికా. ఈ పక్షి ఫొటోను నగరానికి చెందిన ప్రకృతి ప్రేమికుడు జగన్ కాజీపేట మండలం అమ్మవారిపేట చెరువు సమీపంలో గంటల కొద్ది నిరీక్షించి తన కెమెరాలో బంధించారు. సాధారణంగా శీతాకాలంలో చెరువులు, నీరు, గడ్డిపొదలు, పొలాల అంచుల దగ్గర ఎక్కువగా ఈ పక్షులు కనిపిస్తాయని తెలిపారు. మగపక్షి గొంతు భాగంలో నీలి రంగు ఉంటుంది. అందుకే దీనికి బ్లూథ్రోట్ అనే పేరు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఇది చాలా చురుకైన పిట్ట అని, తరచూ తోక కదుపుతూ, కిందికి పైకి ఎగిరి కీటకాలను పట్టుకుంటుందని వివరించారు. దీని కూత మధురంగా ఉంటుందని, కొన్నిసార్లు ఇతర పక్షుల స్వరాలను కూడా అనుకరిస్తుందని పేర్కొన్నారు. ఇది ప్రకృతి వలసల పరిశోధనలకు ముఖ్యమైన జాతిగా కూడా వివరించారు.

తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

- ఐదేళ్ల వయసొచ్చినా మంచానికే పరిమితం
- మానసిక స్థితి బాగాలేని యశ్విత
- ఆస్పత్రులు తిరిగి ఉన్నదంతా ఖర్చు చేసిన తల్లిదండ్రులు
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు





కూతురు యశ్వితతో సర్వేశ్ దంపతులు

కాజీపేట: ఆ కుటుంబ పెద్ద దుకాణంలో పనిచేస్తే రోజుకు రూ.200. ఆ ఇంటామె కూలీకి వెళ్తే రూ.300. ఆ కూలీ పని కూడా నెలలో 10 రోజులు దొరకడం కష్టమే. ఇల్లు లేదు. జాగా లేదు. ఉన్నదాంట్లో సర్దుకుపోదామనుకున్న ఆ దంపతులకు.. కూతురు ఆరోగ్యం నిద్రపట్టనివ్వట్లేదు. కాజీపేట పట్టణం బాపూజీనగర్ కాలనీకి చెందిన తోకల సర్వేష్, ప్రేమలత దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె యశ్వత (5) మానసిక స్థితి సరిగ్గా లేదు. ఇప్పటికీ నడవలేని దుస్థితి. దుకాణంలో జీతం చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న సర్వేష్‌కు కూతురుకు వైద్యం చేయించడం కష్టంగా మారింది. ఇప్పటికే రూ.4 లక్షలు చికిత్స కోసం ఖర్చు చేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కార్పొరేట్ ఆస్పత్రిలో చూపిస్తే తప్ప పరిస్థితి ఏంటో అర్థంకాదని వైద్యులు సూచించడంతో కూతురును అలా వదిలేయలేక, సరైన వైద్యం చేయించే స్తోమత లేక కన్నవాళ్లు తల్లడిల్లుతున్నారు. పూట గడవడమే కష్టంగా మారిన తల్లిదండ్రులు కార్పొరేట్ వైద్యం ఎలా చేయించాలో తెలియక కన్నీళ్లు పెడుతున్నారు. దాతలు ఆర్థిక సాయం అందించి చిన్నారికి ప్రాణం పోయాలని వేడుకుంటున్నారు.

ఆర్థిక సాయం అందించాలనుకుంటే..
కల్వల ప్రేమలత
యూనియన్ బ్యాంక్ కాజీపేట బ్రాంచ్ ,అకౌంట్ నంబర్ 122710100091805
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యుబీఐఎన్ 0802999మెయిన్ రోడ్ కాజీపేట
63008 -12559 నంబర్‌కు ఫోన్‌పే చేయవచ్చు.

పత్తి కొనుగోళ్లకు పూజలు



కాంటాల వద్ద పూజలు చేస్తున్న వ్యాపారులు



సూచిక పట్టికలో ధరలు మార్పులు, చేర్పులు చేయని అధికారులు

వరంగల్ చౌరస్తా: పత్తి కొనుగోళ్ల కోసం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పలువురు వ్యాపారులు, అడ్తిదారులు కాంటాల వద్ద గురువారం ప్రత్యేక పూజాలు చేశారు. కొద్ది రోజులుగా కొత్త పత్తి వస్తున్న నేపథ్యంలో పూజలు చేసి, కాంటాలు ప్రారంభించారు.

మారని సరుకుల ధరలతో అయోమయం

రైతులకు మెరుగైన సేవలు అందించడంలో మార్కెట్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు రోజులుగా దేశ వ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరల మార్పులు, చేర్పులను హాజరు సూచిక పట్టికలో నమోదు చేయడంలో యంత్రాంగం విఫలమైంది. మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి జి.రెడ్డి సెలవుల్లో ఉండటంతో ధరల మార్పులు, చేర్పులు చేసే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పట్టికలో మార్పులు చేయాలని రైతులు కోరుతున్నారు.

నెరవేరిన దశాబ్దాల కల

- కేంద్ర ప్రభుత్వ వెల్‌నెస్ సెంటర్ మంజూరు
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు

హన్మకొండ/హన్మకొండ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరింది. వరంగల్‌కు సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం వెల్‌నెస్ సెంటర్ మంజూరైంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా 22 వెల్‌నెస్ సెంటర్లు మంజూరు చేయగా ఇందులో వరంగల్ ఒక్కటి. ఒక్కో వెల్‌నెస్ సెంటర్‌కు జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఫార్మసిస్ట్, జూనియర్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల మంజూరయ్యాయి. భవనాలు సిద్ధంగా ఉన్న ప్రాంతంలో వెంటనే ప్రారంభించాలని, భవనాలు లేని చోట సంబంధిత సహాయ సంచాలకులకు ప్రతిపాదనలు పంపించాలని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సూచించింది. వరంగల్‌కు వెల్‌నెస్ సెంటర్ మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, వరంగల్‌కు వెల్‌నెస్ మంజూరుకు కృషిచేసినందుకు రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు మగబుల్ హుస్సేన్, విజయ వడ్నాల, వేణుగోపాల్, సత్యనారాయణ, సురేందర్‌రెడ్డి, సీతారామారావు, బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంపత్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

కృత్రిమ మేధ కీలకం

కేయూ క్యాంపస్: రాబోయే రోజుల్లో వివిధ రకాలుగా కృత్రిమ మేధ ప్రభావం చూపనుందని కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం అన్నారు. రెండు రోజులుగా హనుమకొండ ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏఐకి అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాల్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ భైరం ఆనంద్ మాట్లాడుతూ.. అగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా భారతదేశంలో రిటైల్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఎలా జరుగుతుందో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కామర్స్ విభాగాధిపతి సారంగపాణి, అధ్యాపకులు సురేశ్‌బాబు, సుమలత, సురేశ్, మధు, యుగేందర్, సామ్యూల్ ప్రవీణ్‌కుమార్, రాజేశ్వరి, సునీత, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.